


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర **రాజముద్ర**

www.rajamudranews.com

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 18.04.2026 | సంపుటి: 3 | సంచిక: 76 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 18.04.2026 | VOLUME : 3 | ISSUE : 76 | PAGES: 8 | COST: 2/- |


# మహిళా బిల్లుకు బ్రేక్

## కేంద్రానికి భారీ షాక్



- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- మోడీ పిలుపు నిష్ఫలం

వివరాలు 3వ పేజీలో..

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది.



3

## రాజ్యాంగంపై కుట్రను అడ్డుకున్నాం

ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తెస్తే మద్దతిస్తాం

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

## రేవంత్ రెడ్డికి పబ్లిసిటీ వ్యామోహం

- సచివాలయ ఉద్యోగులకు శాపం
- ఆర్టీసీ కార్మికులకు ద్రోహం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



3

హైదరాబాద్, ఏప్రిల్ 17: తెలంగాణలో పాలనను గాలికి వదిలేశారని, కాంగ్రెస్ అరాచకంలో సామాన్య ప్రజలు, కార్మికులు, చివరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా రోడ్లెక్కి

మిగతా 3వ పేజీలో..



# పట్టు విడవని భట్టి.. మెట్టు దిగిన ఆర్టీజన్లు..

- ఐదురోజుల క్రితమే సమ్మె విరమించమని చెప్పిన పవర్ జాక్
- అప్పుడు కాదని ఇప్పుడు అవునన్న నేతలు
- ఫలితంగా 5 రోజుల వేతనం కోత
- చర్చలు లేకుండానే సమ్మె విరమణ
- మంత్రి హామీకి సైలన్స జాక్
- 10 రోజుల విద్యుత్ ఆర్టీసియన్ల సమ్మెకు తెర

**హైదరాబాద్, ఏప్రిల్17:** ఒకే సంస్థ ఒకే విధానం అనే నినాదంతో గత పది రోజులుగా విద్యుత్ ఆర్టీజన్లు చేస్తున్న సమ్మెకు తెరపడింది. శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తో జరిగిన చర్చల్లో కేవలం హామీ తోనే సమ్మె విరమణ ప్రకటన చేసారు. గత పదిరోజులుగా సమ్మె విరమిస్తేనే చర్చలు అనే మొండి పట్టుతో ప్రభుత్వం ఉండగా,తమ డిమాండ్లకు ఒప్పుకుంటేనే

మిగతా 2వ పేజీలో..

# బాయిల్డ్ రైస్ సేకరించండి



3

పాత బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి

పోషకాహార బియ్యం పంపిణీని పునఃప్రారంభించండి

కేంద్ర మంత్రికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతి

## జాతీయ విపత్తును అడ్డుకున్న రోజు

- సీఎం రేవంత్‌రెడ్డి
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై స్పందన
- ప్రతిపక్షాల ఐక్యతతో ప్రమాదం తప్పిందని వ్యాఖ్య



## రాధాకృష్ణన్‌కు సీఎం నివాళులు

3



2

## ఏరోస్పేస్ వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

- ఆర్అండ్‌డీ, అడ్వాన్స్‌డ్ మాన్యు ఫ్యాక్చరింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సులో శ్రీధర్‌బాబు

2

శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

2



## సిగాచి బాధితులకు కోటి పరిహారం ఎక్కడ?

ఒక్కో కుటుంబానికి నగటున రూ.45 లక్షలే అందాయి

మిగిలిన పరిహారం ఎగ్గొట్టారు

హామీ ఇచ్చి నిలబెట్టుకోని రేవంత్ సర్కార్

ప్రతి కుటుంబానికి కోటి చెల్లించాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 18 : సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాద బాధితులకు ఇచ్చిన కోటి రూపాయల పరిహారం హామీని కూడా నిలబెట్టుకోలేక సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసమర్థతను మరోసారి బయటపెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

మిగతా 2వ పేజీలో..



## డీలిమిటేషన్‌తో మహిళా బిల్లును ముడి పెట్టడంతోనే విఫలం

- మహిళా రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



## ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక

అధికారులకు సీఎస్ రామకృష్ణా రావు ఆదేశాలు

2

## కాళేశ్వరం బ్యారేజీల బలోపేతానికి ప్రత్యేక కమిటీ

- మూడు బ్యారేజీల స్థితిపై సమగ్ర పరిశీలన
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో నిపుణుల బృందం
- జూన్ 2026లోగా సాంకేతిక పరీక్షలు పూర్తి లక్ష్యం

2






## తేజస్వీ వ్యాఖ్యలపై తెలంగాణ ఎంపీల నిరసన

వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్

క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎంపీల నినాదాలు

బీజేపీ కార్యాలయం ముట్టడించిన బీఆర్ఎస్‌వీ నేతలు

3



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹66



# శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

- **ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17 :**

హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శాస్త్రి పురం రైల్వే ఓవర్ బ్రిడ్జిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచఎంసీ రూ.71 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో నాలుగు లేన్లలో ఫ్లై ఓవర్‌ను జీహెచఎంసీ నిర్మించింది. జీహెచఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమాకు 30 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలావరకు తగ్గనుంది. ఈఫ్లై ఓవర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్‌పల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

# ‘రోహిత్ వేముల చట్టం’ రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం

- **భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు**
- **ఉన్నత విద్యలో వివక్ష నివారణే లక్ష్యం**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:**

ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షను అరికట్టేందుకు ప్రతిపాదిస్తున్న “రోహిత్ వేముల తెలంగాణ చట్టం” రూపకల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ కమిటీ పనిచేయనుంది. ప్రతిపాదిత బిల్లును సమగ్రంగా పరిశీలించి అవసరమైన సిఫార్సులు చేయడం ఉపసంఘం ప్రధాన బాధ్యతగా నిర్ణయించారు. ఈ కమిటీలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా నియమితులయ్యారు.

ఉన్నత విద్యా వ్యవస్థలో వివక్షకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో సమగ్ర చట్టం అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థుల హక్కులను రక్షించడం, విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యాలుగా పేర్కొంటున్నారు.

కమిటీ సమర్పించే సూచనల ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల భద్రత, గౌరవాన్ని కాపాడే దిశగా ఈ చట్టం కీలకంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

## సిగాచి బాధితులకు
# కోటి పరిహారం ఎక్కడ?



**మొదటిపేజీ తరువాయి**

మండిపడ్డారు. ప్రమాదంలో 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినా వారి కుటుంబాలకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన లెక్కల ప్రకారం ఇప్పటివరకు రూ.24.51 కోట్లు మాత్రమే చెల్లించగా, ఒక్కో కుటుంబానికి సగటున రూ.45.40 లక్షలు మాత్రమే అందాయని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కోటి రూపాయల పరిహారంలో పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టిందని విమర్శించారు. మిగిలిన రూ.29 కోట్లకు పైగా బకాయిని చెల్లించకుండా బాధితులను నట్టేట ముంచిందని అన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కలిసి పరిహారం లెక్కల్లో మోసం చేస్తున్నాయని, కంపెనీ ఇచ్చిన పరిహారంలో పీఎఫ్, ఈఎస్ఐ, బీమా డబ్బులను కూడా కలిపి చూపిస్తున్నారని ఆరోపించారు. ఇది కార్మికుల హక్కులను దోపిడీ చేయడమేనని అన్నారు. ప్రమాదంలో భద్రతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించబడ్డాయని, అనుమతికి మించిన సామర్థ్యంతో యంత్రాలు నడిపారని పేర్కొన్నారు. ఈ ఘటన కేవలం ప్రమాదం కాదని, నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని వ్యాఖ్యానించారు. బాధితులకు న్యాయం జరగకపోవడంతో హైకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే పోలీసులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. అరెస్టులు కూడా నాటకీయంగా జరిగాయని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కంపెనీ యాజమాన్య ఆస్తులను అటాచ్ చేసి అయినా బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతదేహాల సాక్షిగా ఇచ్చిన హామీ ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులకు సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ‘జాతీయ విపత్తును అడ్డుకున్న రోజు’ : సీఎం రేవంత్‌రెడ్డి

- **131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై స్పందన**
- **ప్రతిపక్షాల ఐక్యతతో ప్రమాదం తప్పిందని వ్యాఖ్య**

**హైదరాబాద్:**

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకుండా నిలిచిపోవడం దేశానికి జాతీయ విపత్తు తప్పినట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతిపక్షాలు ఏకమై పోరాడిన ఫలితమే ఈ పరిణామమని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య శక్తుల సమిష్టి కృషితో దేశానికి ముప్పుగా మారే పరిస్థితిని అడ్డుకోగలిగామని సీఎం తెలిపారు. ప్రతిపక్ష నేతలు సమన్వయంతో వ్యవహరించడంతో ఈ బిల్లు ఆమోదం పొందకుండా నిలిచిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు.

దేశ రాజకీయ చరిత్రలో ఈ రోజును ఒక ముఖ్యమైన రోజుగా గుర్తుంచుకుంటారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసి నిలిచిన ప్రతిపక్ష నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ‘ఏరోస్పేస్’ వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

- **సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా ఎకో సిస్టం అభివృద్ధి**
- **ఆర్‌అండ్‌డీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్‌పై ప్రత్యేక దృష్టి**
- **ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:**



భవిష్యత్తు ఏరోస్పేస్ రంగ అవసరాలకు అనుగుణంగా తెలంగాణను దేశానికి ఒక వ్యూహాత్మక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆర్ అండ్ డీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్.. ఈ మూడింటినీ అనుసంధానించగలిగే దేశాలు, రాష్ట్రాలే రాబోయే రోజుల్లో ఏరోస్పేస్‌లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయన్నారు. ఆ దిశగా ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో ‘ఎకో సిస్టం’ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ‘ఛేంజింగ్ సినారియో ఇన్ ఏరోస్పేస్ ఆర్ అండ్ డీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సర్టిఫికేషన్’ అంశంపై శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏరోస్పేస్ అంటే యంత్రాల తయారీ మాత్రమే కాదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మ విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు. ఈ రంగంలో ఒకప్పుడు యూఎస్, రష్యా, ఐరోపా దేశాలే ఆధిపత్యం చెలాయించేవని, ఇప్పుడు వాటికి దీటుగా గ్లోబల్ సప్లై చైన్‌లో మన దేశం కూడా ‘కీ’ రోల్ ప్లే చేస్తోందని అన్నారు. యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో సైంటిస్టులు, ఇంజనీర్లు మన దేశంలోనే ఉన్నారన్నారు. మెకిన్సే నివేదిక ప్రకారం ల్యాబ్‌ల్లో జరిగే పరిశోధనల్లో 30 శాతం కూడా కమర్షియల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిశోధనల్ని ఉత్పత్తులుగా మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. డెలాయిట్ గ్లోబల్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సర్వే ప్రకారం నేడు 74 శాతం మంది ఏరోస్పేస్ సీఈఓలు కేవలం తక్కువ ఖర్చు కంటే పటిష్ఠమైన సప్లైచైన్, తయారీ సామర్థ్యానికే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,000 కొత్త ఎయిర్ క్రాఫ్ట్స్ అవసరం ఉంటుందని బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు అంచనా వేశాయన్నారు. ఈ డిమాండ్‌ను హైదరాబాద్ అందిపుచ్చుకునేలా ఇక్కడి ప్రిసిషన్ ఇంజనీరింగ్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ నెట్‌వర్క్, బలమైన ఎంఎస్ఎంఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికీ మనం ఏరోస్పేస్ టెస్టింగ్, సర్టిఫికేషన్ కోసం విదేశాలపైనే ఆధారపడాల్సి వస్తోందని, ఫలితంగా ఖర్చు పెరగడమేకాక ఉత్పత్తుల గ్రౌండింగ్‌కు 18 నుంచి 24 నెలల వరకు అదనపు సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయి సర్టిఫికేషన్ ఎకో సిస్టం అభివృద్ధికి హైదరాబాద్ అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని, ఆ దిశగా కేంద్రం చొరవ చూపాల్సిన అవసరముందని శ్రీధర్‌బాబు అన్నారు.

డ్రోన్లు, రీయూజబుల్ రాకెట్లు, ఏఐ ఏవియానిక్స్, 3డీ ప్రింటింగ్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ తదితర అంశాలు రాబోయే రోజుల్లో ఏరోస్పేస్ భవిష్యత్తును శాసిస్తాయన్నారు. అందుకు అనుగుణంగానే ఇప్పటి నుంచే తెలంగాణను సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు ప్రపంచస్థాయి ఏరోస్పేస్ దిగ్గజ సంస్థలకు విడిభాగాలను సరఫరా చేస్తూ మేడిన్ తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ ఆర్‌అండ్ డీ ఇన్‌స్టిట్యూషన్లు, గ్లోబల్ ఓఈఎంలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఆదిభట్ల ఏరోస్పేస్ ఎస్ఈజెడ్, ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, రోడ్డు నెట్ వర్క్ తదితర మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్ ప్రపంచ ఏరో స్పేస్ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూసేలా చేశాయన్నారు. హైదరాబాద్ వేదికగా ఏరో స్పేస్ భవిష్యత్తును నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తలను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. అనంతరం ఏరోస్పేస్ రంగంలో విశేష కృషి చేసిన పలువురు శాస్త్రవేత్తలు, ప్రముఖులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్, డీజీ సీఎస్ఐఆర్ అండ్ డీఎస్ఐఆర్ సెక్రటరీ డీ.ఎన్ కళైసెల్వి, ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ సోమనాథ్, రాజబాబు, డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల బలోపేతానికి ప్రత్యేక కమిటీ

- **మూడు బ్యారేజీల స్థితిపై సమగ్ర పరిశీలన**
- **కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో నిపుణుల బృందం**
- **జూన్ 2026లోగా సాంకేతిక పరీక్షలు పూర్తి లక్ష్యం**
- **జాతీయ డ్యామ్ భద్రత ప్రమాణాలతో మరమ్మత్తుల ప్రణాళిక**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:**



కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన కీలక బ్యారేజీల భద్రతను మరింత బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థితిపై తలెత్తిన సందేహాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జాతీయ స్థాయి నిపుణుల సూచనలను అనుసరిస్తూ ఈ మూడు బ్యారేజీల్లో భూగర్భ పరిస్థితులను తెలుసుకునే జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పనుల కోసం నీటి పారుదల శాఖలో టన్నెల్స్-సేఫ్టీ విభాగం కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా నాయకత్వంలో ఉన్నత స్థాయి బృందాన్ని నియమించారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల సహాయంతో బ్యారేజీల పునాదుల బలం, భూగర్భ పరిస్థితులను విశ్లేషించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతగా ఉంటుంది. పరీక్షల ద్వారా లభించే వివరాల ఆధారంగా మరమ్మత్తులు, బలోపేత పనులకు తుది ప్రణాళిక రూపొందించనున్నారు. కేంద్ర జల సంఘం మరియు జాతీయ డ్యామ్ భద్రత సంస్థ ఆమోదించిన నమూనాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు. నిర్మాణంలో ఉన్న లోపాలను సరిచేసి భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పరిస్థితిపై పూర్తి అవగాహన కలగాలనే ఉద్దేశంతో జూన్ 2026 నాటికి అన్ని సాంకేతిక పరీక్షలను పూర్తి చేయాలని కమిటీకి గడువు విధించారు. అవసరమైన చోట తాత్కాలిక రక్షణ చర్యలను కూడా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పునరుద్ధరణ పూర్తయితే సాగునీటి సరఫరా వ్యవస్థ మరింత స్థిరంగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. నిపుణుల నివేదిక అందిన వెంటనే మరమ్మత్తు పనులను వేగంగా ప్రారంభించేందుకు అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.



# ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక

- **అధికారులకు సీఎస్ రామకృష్ణా రావు ఆదేశాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 17:**

భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అధిక సంఖ్యలో విద్యుత్ వాహనాల(ఈవీ) చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. విద్యుత్ వాహనాల వినియోగం అధికమైనందున పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని చార్జింగ్ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా సమగ్ర వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ఈవీ చార్జింగ్ మౌలిక వసతుల అమలుపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ మౌలిక వసతుల విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై సీఎస్ సమీక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగవంతం అవుతున్నందున వినియోగదారుల అవసరాలను తీర్చడానికి విస్తృతమైన చార్జింగ్ నెట్‌వర్క్ ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఈవీ చార్జింగ్ మౌలిక వసతులను మ్యాపింగ్‌కు, పర్యవేక్షించడానికి కేంద్రీకృత, రియల్‌టైమ్ డ్యాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ డ్యాష్‌బోర్డ్ ఈవీ కేంద్రాల ఏర్పాటు ప్రణాళిక, పురోగతి పర్యవేక్షణ, పారదర్శకతకు కీలక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ అపార్టుమెంట్ భవనాల బేస్‌మెంట్‌లలో ఈవీ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడాన్ని తప్పనిసరి చేసే విధానాన్ని రూపొందించే ప్రక్రియలో ఇంధన శాఖ ఉందని వెల్లడించారు. ఈ విధానం నగరవాసులకు సౌకర్యవంతమైన హోమ్ చార్జింగ్ అవకాశాలను కల్పించడం ద్వారా ఈ వాహనాల వినియోగాన్ని పెంచడానికి దోహదపడుతుందన్నారు. సమావేశంలో రవాణా, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, టీజీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ శశాంక, జీహెచఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీరెడ్కో ఎండీ అనిలా వవిల్లా, ఓఈఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్టు విడవని భట్టి..
# మెట్టు దిగిన ఆర్టీజన్లు..

**మొదటిపేజీ తరువాయి**



సమ్మె విరమిస్తామని టీజాక్ మొండికేసింది. కానీ శుక్రవారం ట్రాన్స్కో సీఎండీ పిలుపు మేరకు విద్యుత్ శాఖ మంత్రిని ట్ జాక్ ఛైర్మెన్ సతీష్ రెడ్డి బృందం కలిసింది. తమ డిమాండ్లను మంత్రి బట్టి ముందుంచగా ఎదున్న సీఎండీ గారు మీకు సానుకూలంగా ఉంటారు ,వారితో చర్చించండి ఆర్థిక భారం లేని అన్ని డిమాండ్లు పరిష్కరిస్తాం.ముందు సమ్మె విరమించండని మంత్రి కోరగా అయన హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్టు జాక్ నేతలు ప్రకటించారు.

**ట్రాన్స్కో సీఎండీ పెద్దన్న పాత్ర**

సంస్థలో సమ్మె సమస్యలకు దారితీస్తుందని గమనించిన ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ గురువారం ఆర్టీసియన్ టీజాక్ నేతలను చర్చలకు అహ్వానించారు. ఈ సందర్భంగా సంస్థను కాపాడుకోవాలంటే సమ్మె విరమించాలని అయన జాక్ నేతలను కోరారు. మీ డిమాండ్లలో సాధ్యమైనవి కచ్చితంగా ఇప్పిస్తా కానీ ముందు సమ్మె విరమించండని కోరారు.మంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలనీ ఈ సందర్భంగా టిజాక్ నేతలు కోరగా అందుకు అయన అంగీకరించారట. దాని ఫలితమే శుక్రవారం మంత్రి భట్టి విక్రమార్కాతో జరిగిన టీజాక్ మీటింగ్. సంస్థకు మేలు చేయాలన్న ఆలోచనతో పాటు కార్మికుల పక్షాన మంత్రితో చర్చలకు అవకాశం కల్పించడం వల్లే సమ్మె విరమణ జరిగిందని ఆర్టీసియన్ నేతలు తెలిపారు.

**ఐదు రోజుల క్రితమే ఒప్పుకుంటే..**

ఆర్టీసియన్ల సమ్మె విరమణకు పవర్ జేఏసీ మంత్రి బట్టి విక్రమార్కతో ప్రత్యకంగా సమావేశం అయ్యింది. అప్పట్లో మంత్రి సైతం విద్యుత్ శాఖ. పరిస్థితి కేంద్రం ప్రైవేట్ పరం చేయాలన్న ఉద్దేశాన్ని వివరించారట. ఈ పరిస్థితుల్లో సమ్మె చేసి సంస్థను మరింత నష్టాలపాలు చేయడం సరికాదని సమ్మె విరమిస్తే తప్పక సానుకూలమైన చర్చలు జరుపుతామని చెప్పారట. అదే విషయాన్నీ ఆర్టీసియన్ జేఏసీ కి వివరించినా అప్పట్లో ఒప్పుకోలేదు. ఒకవేళ ఒప్పుకునుంటే 5 రోజుల వేతనం కోతతో పాటు చర్చల్లో సానుకూలత లేనపుడు పవర్ జేఏసీ పై ఒత్తిడి ఉండేది. విద్యుత్ శాఖలో అన్ని రకాల ఉద్యోగుల జాయింట్ అక్షన్ కమిటీ పవర్ జేఏసీ అది తెలిసి కూడా అప్పట్లో నిర్లక్ష్యం చేయడం వల్ల ఆర్టీసియన్లకు కొంత మేర అన్యాయం జరిగినట్టే అని విశ్లేషకులు భావిస్తున్నారు.

**హామీ మాత్రమే ఇచ్చారు!**

ఆర్టీసియన్ల డిమాండ్లకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిపిన చర్చల్లో కేవలం చేద్దాం అన్న హామీ మాత్రమే లభించినట్టు సమాచారం. మూడురోజుల్లో ట్రాన్స్కో సీఎండీ , ఇంధన శాఖ కార్యదర్శి సమక్షంలో చర్చలు జరిగే అవకాశం ఉంది. అక్కడ ఇప్పుడుంచిన డిమాండ్లలో అధికారులు ఒప్పుకున్న వాటికే పరిష్కారం లభించే అవకాశం ఉంది. ఆర్టీజన్ల డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకుందన్న సమాచారంతో తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆర్టీసియన్లు టపాకులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఇక రేపటినుండి యదాతతంగా విధుల్లోకి ఆర్టీసియన్లు చేరనుండటంతో తెలంగాణ లోని రెండు విద్యుత్ యాజమాన్యాలు ఉపిరిపీల్చుకున్నాయ్.

# రేవంత్ రెడ్డికి పబ్లిసిటీ వ్యామోహం

**మొదటిపేజీ తరువాయి**

నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ఆవేదన కలిగిస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే నిలయం సెక్రటేరియట్‌లోనే ఇవాళ ఉద్యోగులు భోజన విరామ నిరసన చేస్తున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత అసమర్థంగా ఉందో అర్థమవుతోందన్నారు. పీఆర్సీ అమలు లేదు.. పెండింగ్ డీఏలు రావు.. హెల్త్ కార్డులు పనిచేయవు.. చివరకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ఓపీఎస్ హామీని కూడా గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కిన సచివాలయ ఉద్యోగుల 'భోజన విరామ నిరసన'కు, 22 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులకు బీజేపీ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోందన్నారు. తమ హక్కుల కోసం, విలీనం కోసం ఈనెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్న ఆర్టీసీ కార్మికులను చూసి ప్రభుత్వం వణుకుతోందని, అందుకే కొన్ని జేఏసీలో లేని సంఘాలతో లాలూచీపడి కార్మికుల ఐక్యతను దెబ్బతీయాలని రేవంత్ రెడ్డి సర్కారు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. గతంలో కూడా ఇలాగే కార్మికులను మోసం చేశారన్నారు. పీఆర్సీ, ఎరియర్స్ అడిగితే కుట్రలు చేస్తారా.. మీ అసమర్థతకు ఆర్టీసీ కార్మికుల కుటుంబాలను బలి చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రమంతా సమ్మెల బాట పట్టినా, ఉద్యోగులు ఆందోళనలో ఉన్నా సీఎంకి మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. ఆయనకు తన వ్యక్తిగత ప్రతిష్ట నిర్మాణం మీద ఉన్న ధ్యాస ప్రజల సమస్యల మీద లేదని ఎద్దేవా చేశారు. జాతీయ నాయకుడిగా ఎదగాలనే ఆరాటంతో దేశాన్ని విడగొట్టేలా నార్త్ వర్సెస్ సౌత్ అంటూ విషం చిమ్ముతున్నారన్నారు. ప్రధాని మోదీ మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకొస్తున్న చరిత్రాత్మక చట్టాన్ని అడ్డుకోవడానికి వితండవాదాన్ని తెరపైకి తెస్తున్నారన్నారు. డీలిమిటేషన్ పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ మహిళల హక్కులకు గండికొట్టాలని చూడటం దుర్మార్గమని రామచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే సీఎం మాత్రం ఢిల్లీ పర్యటనలు, రాజకీయ వక్రీకరణలు, విద్వేషాలు చెచ్చగొట్టడంలో మునిగిపోయారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తక్షణమే సచివాలయ ఉద్యోగుల డిమాండ్లను, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు కారణమైన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని రామచందర్‌రావు తెలిపారు.

**మహిళా సాధికారత డిమాండ్‌ను నెరవేరుస్తున్న మోదీ**

మహిళా సాధికారత కోసం ముప్పయ్యేళ్లకు పైగా దేశ మహిళలు ఎదురుచూస్తున్న చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ డిమాండ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేరుస్తున్నారని రామచందర్‌రావు తెలిపారు. 2023లో చట్టంగా మారిన నారీశక్తి వందన్ అధినియం రాజ్యాంగ సవరణ ద్వారా 2029 నుండి అమలులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇది దేశ మహిళల సాధికారత దిశగా ఒక చరిత్రాత్మక నిర్ణయమన్నారు. పల్లవి కాలేజీలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సాండ్ ఆర్ట్ కార్యక్రమంలో పాల్గొని మహిళల తరఫున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# బాయిల్డ్ రైస్ సేకరించండి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:**



యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పండే యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో రేవంత్, ఉత్తమ్‌లు శుక్రవారం ఉదయం కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని వారు కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్‌ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్‌ఎంటీ బాయిల్డ్ రైస్(5 శాతం నూకతో), 5 ఎల్‌ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అలాగే 201415 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ.1,468.94కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి తెలియజేశారు. పౌరసరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కాగా, పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు పోషకాహార బియ్యాన్ని (ఎఫ్‌ఆర్‌కే) పాఠశాలలు, వసతి గృహాలు, ఐసీడీఎస్‌ల పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని, వెంటనే దానిని పునః ప్రారంభించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ సింగ్, కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాధాకృష్ణన్‌కు సీఎం నివాళులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:**

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు. భార□ దేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారత దేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.



# బిల్లుకు బ్రేక్.. కేంద్రానికి షాక్

- వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోదీ పిలుపు నిష్ఫలం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:**

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మూడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోదీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

## ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు

- కాంగ్రెస్, బిఆర్ఎస్ ల తీరుపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:**

డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని, సీట్లు తగ్గుతాయని.. దక్షిణాదికి, ఉత్తరాదికి యుద్ధం వస్తుందని విపక్ష పార్టీలు మాట్లాడడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఏ రాష్ట్రానికీ ఎలాంటి అన్యాయం జరగదని లోక్‌సభ వేదికగా కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి, హోంమంత్రి చాలా స్పష్టమైన సందేశాన్నిచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు జరిగిన పునర్విభజన తీరులో కాకుండా అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేసే విధంగా అందరికీ అనుకూలమైన, ఆమోదయోగ్యమైన బిల్లును తీసుకొస్తున్నామన్నారు. దక్షిణాదిలో సీట్లు తగ్గకుండా ప్రజల సెంటిమెంటును మోదీ ప్రభుత్వం గుర్తించి 50% పెంపు ఫార్ములా తీసుకొచ్చినప్పటికీ విపక్షాలకు సంతృప్తి కలగలేదన్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తే, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దేశంలోని అన్ని ప్రాంతాల్లో మహిళలు, పురుషుల్లో కొత్త నాయకత్వం వస్తుందనే భయం విపక్షాల్లో ఉందని అన్నారు. అదే జరిగితే కుటుంబాల చేతుల్లో ఉన్న పార్టీల నాయకులకు వారి ప్రాబల్యం తగ్గుతుందనే భయం ఉందన్నారు.

# రాజ్యాంగంపై కుట్రను అడ్డుకున్నాం

- ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కాదు
- మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తెస్తే మద్దతిస్తాం
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ఢిల్లీ: మహిళా బిల్లు వీగిపోవడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రను తిప్పికొట్టామన్నారు. ఇది ముమ్మాటికీ మహిళా బిల్లు కానేకాదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని 2023కు సంబంధించిన మహిళా రిజర్వే షన్ చట్టాన్ని తీసుకువస్తే మద్దతిస్తామని తెలిపారు. డీలి మిటేషన్‌తో మహిళా బిల్లుకు ముడిపెడితే కుదరదన్నారు. కాగా అంతకు ముందు లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై వాడీవేడీ చర్చ జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఛాలెంజ్ విసిరారు.. కాంగ్రెd నాయకులు మహిళా రిజర్వేషన్ల బిల్లులో 50శాతం సీట్లు పెంచే విషయాన్ని రాతపూర్వంగా బిల్లులో రాసి తీసుకుని వస్తే బీజేపీ మద్దతిస్తుందా అని ప్రశ్నించారు? దీనికి అమిత్ షా ఘాటుగా స్పందించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ప్రస్తుతమున్న బిల్లును కేవలం గంటలోపే మార్చి తిరిగి ప్రవేశపెడతామని కాంగ్రెస్ మద్దతిస్తుందా అని ప్రశ్నించారు. అదే విధంగా 50శాతం సీట్ల పెంపును బిల్లులో పెట్టేందుకు సిద్దమని ఆ కాఫీని ప్రతి ఎంపీకి అందజేస్తామని తెలిపారు. డీలిమిటేషన్‌తో మహిళా రిజ ర్వేషన్ బిల్లును కలపకూడదని మహిళా బిల్లును అడ్డు కోవడానికి కాంగ్రెస్ పార్టీ వేసిన ట్రాఫ్‌లో భాగంగానే ఈ రెండు బిల్లులను కలుపుతున్నారని తెలిపారు. అంతకు ముందు రాహుల్ గాంధీ ఈ బిల్లుపై మాట్లాడారు. 2023 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని ఇది మహిళలను అడ్డుగా పెట్టి తీసుకొచ్చిన షేమ్ ఫుల్ యాక్ట్ అన్నారు. నిన్న జరిగిన సభలో తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన ప్రసంగం తనకు ఎంతో గర్వంగా అనిపించిందన్నారు. మన జీవితంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తల్లులు చెల్లెలు, భార్య బిడ్డల రూపంలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తారన్నారు. కాగా ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బి ల్లు పేరుతో కేంద్రం ఎంతో కుట్ర చేస్తోందన్నారు. ఇది రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చాలనుకుంటున్న బిల్లు అని రాజ్యాంగాన్ని బైపాస్ చేసి నియోజకవర్గాలని పెంచాలను కుంటున్నారని రాహుల్ ఆరోపించారు. కాగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మట్నత్తం 528 మంది ఓటింగ్‌లో పాల్గొనగా అనకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓట్లు వేశారు. దీంతో సరైన సంఖ్యా బలం లేక బిల్లు వీగిపోయింది.



# డీలిమిటేషన్‌తో మహిళా బిల్లును ముడిపెట్టడంతోనే విఫలం : కవిత

- మహిళా రిజర్వేషన్లపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శ
- ఓబీసీ లెక్కల ఆధారంగా కోటాలు ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్:**

మహిళా రిజర్వేషన్ల బిల్లును డీలిమిటేషన్ బిల్లుతో అనుసంధానం చేయడమే లోక్‌సభలో అది నిలవకపోవడానికి కారణమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. మహిళల హక్కుల విషయంలో బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన వైఖరి లేకుండా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు.

2027 జనగణనలో ఓబీసీలను ప్రత్యేకంగా లెక్కించి, ఆ గణాంకాల ఆధారంగా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లపై నిజమైన సంకల్పం ఉంటే బిల్లును వేరుగా తీసుకురావాల్సిందని, కానీ ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తాయని తెలిసినా రెండు బిల్లులను కలిపి తీసుకురావడం రాజకీయ ఉద్దేశ్యంతో చేసిన చర్యేనని ఆమె వ్యాఖ్యానించారు.

కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభ సమయంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి దానిని జనగణనకు అనుసంధానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం 2011 జనగణన ఆధారంగా అమలు చేస్తామని చెప్పడం మహిళలను మరోసారి నిరాశపరిచినట్టేనని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా మహిళలు ఈ పరిణామాలను గమనించాలని, మహిళల హక్కుల విషయంలో మోసపూరిత రాజకీయాలకు తావు ఇవ్వకూడదని కవిత పిలుపునిచ్చారు.



## లక్ష్యాన్ని సాధించే మార్గాలు కూడా మంచివే కావాలి


**హైదరాబాద్, ఏప్రిల్ 17:**

లక్ష్యం మాత్రమే కాదు.. ఆ లక్ష్యాన్ని సాధించే మార్గాలు కూడా మంచివే కావాలి అని మహాత్మా గాంధీజీ చెప్పిన ఆలోచన ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి మార్గదర్శకం కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివ ద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల అంశంపై లోక్‌సభలో శుక్రవారం జరిగిన పరిణామాలు బీజేపీ కపట నీతిని బహిర్గతం చేశాయని విమర్శించారు. మహిళల సాధికారతపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే సింపుల్ మెజారిటీతోనే రిజర్వేషన్లను అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ కావాలని డీలిమిటేషన్ అంశాన్ని జోడించి బిల్లును సంక్లిష్టం చేశారని మండిపడ్డారు. ఇది మహిళల హక్కులను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం కాదని, రాజకీయ లాభాల కోసం తీసుకున్న నిర్ణయం మాత్రమేనని స్పష్టమవుతోందన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలపై తెలంగాణ ఎంపీల నిరసన

- వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్
- క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఎంపీల నినాదాలు
- బీజేపీ కార్యాలయం ముట్టడించిన బీఆర్‌ఎస్‌వీ నేతలు

**న్యూఢిల్లీ/హైదరాబాద్:**




తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించే వ్యాఖ్యలు చేయొద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆయన వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగానూ నినాదాలు చేశారు.

తరువాత లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు ఎంపీలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు గతంలో బీజేపీ నేతలు కూడా మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేస్తూ, పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఎంపీలు విమర్శించారు. మరోవైపు తేజస్వీ సూర్య వ్యాఖ్యలను ఖండించకపోవడంపై బీఆర్‌ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్‌వీ నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా బీజేపీ యువజన విభాగం కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బీఆర్‌ఎస్‌వీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకుని లోక్‌సభ స్పీకర్‌ను కలిసి తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తేజస్వీ సూర్యపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణను కించపరిచే వ్యాఖ్యలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సభ్యత్వాన్ని రద్దు చేయాలని కూడా కొన్ని వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

# మనస్సాక్షిగా మహిళా బిల్లుకు మద్దతు ఇవ్వండి

- మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో పెద్ద అవకాశం
- మహిళలను గౌరవించేందుకు సమిష్టిగా కృషి చేద్దాం
- ఎంపీలకు ప్రధాని ప్రధాని మోడీ పిలుపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులంతా తమ మనస్సాక్షికి అనుగుణంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని మహిళా శక్తిని గౌరవించడానికి ఇదో గొప్ప అవకాశమని ఆయన కొనియాడారు. మహిళలకు తగిన హక్కులను కల్పించడంలో అందరం సమష్టిగా చరిత్ర సృష్టించాలన్నారు. ఏకాభిప్రాయంతో ఈ సవరణను ఆమోదించాలని, దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఎక్స్ వేదికగా ప్రధాని కోరారు. 'నేను ఎంపీలందరినీ కోరేది ఒక్కటే.. మీ ఇంట్లోని తల్లిని, సోదరిని, కుమార్తెను, భార్యను గుర్తుంచుకుని.. మీ మనస్సాక్షి చెప్పిందే వినండి. దేశ మహిళలకు సాధికారత కల్పించడం అనేది ఒక గొప్ప అవకాశం. వారికి కొత్త అవకాశాలను దూరం చేయకండి. ఈ సవరణ ఏకాభిప్రాయంతో ఆమోదం పొందితే.. దేశంలో మహిళా శక్తి మరింత బలోపేతమవుతుంది. ఫలితంగా.. దేశ ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. రండి.. ఈ రోజు మనమందరం కలిసి చరిత్ర సృష్టిద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు వారి హక్కులు ఇచ్చేందుకు సమయం ఆసన్నమైందని అంతకముందు జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు చేసిన సవరణలపై పార్లమెంటులో సవివరమైన, సుదీర్ఘ రీతిలో చర్చ జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చలో సదరు బిల్లుపై ఉన్న అపోహలను తొలగించామని, సభ్యుల సందేహాలన్నింటికీ నివృతి చేశామని ఆయన తెలిపారు. ఇది చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని, దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌ను రాజకీయం చేశారని, నిర్ణయాలు తీసుకునే పక్రియలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ బిల్లు లోక్‌సభలో ఓటింగ్‌కు రానున్న నేపథ్యంలో ఎంపీలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు మోదీ. సభ్యులు సున్నితంగా వ్యవహరించాలని, 'నారీ శక్తి' మనోభావాలను దెబ్బతీయవద్దని కోరారు. నారీ శక్తి వందన్ అధినియమ్‌కు సవరణలు చేసే విషయంపై పార్లమెంట్‌లోచర్చ జరుగుతోంది. నిన్నరాత్రి ఒంటిగంట వరకు చర్చ నడిచింది. బిల్లుల విషయంలో ఉన్న అపోహలను తొలగించేలా ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. 4 దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎన్నో రాజకీయాలు జరిగాయి. దేశ జనాభాలో సగ భాగంగా ఉన్నవారు తమ హక్కులను పొందడానికి సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నిర్ణయాలు తీసుకునే పక్రియలో వారికి ప్రాతినిధ్యం లేకపోవడం సరికాదు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు నా విన్నపం ఒక్కటే. పూర్తి పరిశీలన తర్వాత మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకొని ఓటు వేయండి' అని ప్రధాని కోరారు. మహిళా శక్తికి సేవచేయడానికి, వారిని గౌరవించేందుకు ఇదొక అద్భుత అవకాశం. మహిళలకు కొత్త అవకాశాలను దూరం చేయొద్దు. చరిత్ర సృష్టించేందుకు ఈ రోజు మనమంతా ఏకమవుదాం' అని 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రా హుల్ తీవ్రంగా విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా.. కేంద్రమంత్రులు





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానించడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలను కున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.



## సంపాదకీయం

# ప్రజలకు భారం కానున్న సీట్ల పెంపు!

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబ డాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడువుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతున్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ది కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ÷ాజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

## దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం

### డీలిమిటేషన్ ప్రక్రియపై శశిథరూర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** పార్లమెంట్‌లో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ తీవ్రరూపం దాల్చింది. జనాభా ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ పక్రియకు సంబంధించి చొరవ తీసుకుంటోంది. అయితే డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా డీలిమిటేషన్ బిల్లుపై చర్చ కొనసాగింది. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నారని, వారి మాటలకు విరుద్ధంగా డీలిమిటేషన్ బిల్లు రూపొందించారని ఆయన విమర్శించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా మరింత నష్టపోతాయని శశిథరూర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం మంచిదేనని, అయితే దీని అమలకు 2011 జనాభా లెక్కలకు, నియోజకవర్గాల పునర్విభజన పక్రియకు ముడిపెట్టడారని ఆయన విమర్శించారు. ఒకేసారి 816 మంది సభ్యులకు సీట్లు పెంచడం ఆషామాషీ కాదన్నారు. దీంతో ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు లోక్ సభలో ఈ మూడు బిల్లుల ఓటింగ్ ఉత్కంఠ రేపుతోంది. సాయంత్రం 4 గంటలకు స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ చేపట్టనున్నారు. విపక్షాల్లోని పలు పార్టీలతో ఎన్డీయే నేతలు మంతనాలు చేస్తున్నారు. మరోవైపు ఓటింగ్ వేళ ఇండియా కూటమి వ్యూహారచన చేపట్టింది. ఇండియా కూటమికి భేటీకి ఆర్జేడీ హాజరుకావడంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక్కొక సభ్యుడు ఉన్న పార్టీలను కూడా ఈ కూటమి సంప్రదిస్తోంది.

## రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా మరోమారు హరివంశ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

## రెండోరోజూ డీఎంకే నిరసన

### ఆదరాబాదరాగా చట్టాలను తేవడంపై కనిమొళి అభ్యంతరం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** మహిళా రిజర్వేషన్ అమలు, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటులో రెండోరోజు చర్చ ప్రారంభమైంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ సాగుతోంది. ప్రభుత్వ తీరుపై మరోసారి ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎంకే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. డిఎంకె ఎంపిలు వరుసగా రెండోరోజూ నల్లదుస్తులతో సభకు హాజరయ్యారు. హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఈ సందర్భంగా కనిమొళి అన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తించట్లేదని అన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. కేంద్రం చర్యలపై మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేషన్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. మహిళా బిల్లుకు అభ్యంతరం లేదని, కేవలం డీలిమిటేషన్ విషయంలోనే ఇంత తొందరెందుకని ప్రశ్నించారు. కావాలంటే ఉన్న సీట్లతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

## దామరగిద్ద వార్డులో న్యూట్రిషన్ హెల్త్ క్యాంప్ ప్రారంభం

**హాజరైన కౌన్సిలర్ తాళ్ళపల్లి నర్సింలు**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** న్యూట్రిషన్ హెల్త్ క్యాంప్ ను వార్డు ప్రజలందరూ సద్వినియోగపర్చుకోవాలని తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ తాళ్లపల్లి నరసింహులు అన్నారు. శుక్రవారం రోజు గ్రామంలో న్యూట్రిషన్ హెల్త్ ఆయుర్వేదిక్ క్యాంప్ ప్రారంభించడం జరిగింది. కేవలం 200 రూపాయలకే 39 రకాల కంప్యూటర్ చెకప్ లు చేయడం జరుగుతుందని, కాబట్టి గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోగలరని సూచించారు. నేడు కూడా అందుబాటులో ఉంటుంది వార్డు ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్య, దొడ్డి సత్తయ్య, అక్నాపురం నర్సింలు, దొడ్డి మల్లేష్, ఎర్రవల్లి శంకరయ్య, బోడ పవన్, బోడ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు అండగా సిఐటియు

**సిఐటియు జిల్లా అధ్యక్షులు రుద్రకుమార్**



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** భవన నిర్మాణ కార్మికులకు సిఐటియు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు రుద్రకుమార్ అన్నారు. శుక్రవారం రోజు మొయినాబాద్ మండల పరిధిలోని భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు సిఐటియులో చేరారు. మొయినాబాద్ పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, మొయినాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ యూనియన్ నాయకులు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జాజాల రుద్ర కుమార్ సమక్షంలో సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు రుద్ర కుమార్ మాట్లాడుతూ... సిఐటియు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. మొయినాబాద్ మండల పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ప్రమాదం జరిగిన వారికి సిఐటియు అండగా ఉంటుందని, కార్మికులకు ఏ సమస్య వచ్చినా సిఐటియు సంఘం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఇన్సూరెన్స్ కార్డు పొందుతే కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. ఏ ప్రమాదం జరిగిన ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్ సిఐటియు కార్మికులకు అందిస్తుందని, అందుకే సంక్షేమ బోర్డు కార్డు తీసుకోవాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు, మొయినాబాద్ సెంట్రింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బుర్ర శంకర్, ప్రధాన కార్యదర్శి చింతల రవి, కోశాధికారి చింతల మోనాకర్, గౌరవాధ్యక్షులు చింతల దర్శన్, రామ్ రెడ్డి, బాబు సాగర్, నవీన్ సాగర్, శ్రీధర్, సతీష్, మల్లేష్, ప్రభు సాగర్, లక్ష్మీనారాయణ, యాదయ్య, ముత్యాలు, అశోక్, నర్సింగ్ రావు, చింతల రాజు, ఆనంద్ తదితరులు సిఐటియులో చేరారు. సిఐటియులో చేరిన యూనియన్ నాయకులు మాట్లాడుతూ...మొయినాబాద్ మండల పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఆపద వచ్చిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## అంగన్వాడి సెంటర్లను పరిశీలించిన పిడి



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో మూడు అంగన్వాడి సెంటర్లను శుక్రవారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా జిల్లా అధికారి పిడి ప్రమీల పరిశీలించారు, పోషణ పక్షంలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ గురించి బెన్ఫిషర్ట్స్ కు, పాలు, గుడ్డు, కూరగాయలు, ఆ కూరలు వాటి ప్రాముఖ్యత గురించి అందులో ఉన్న పోషకాల గురించి వివరించారు, ప్రీ స్కూల్ పిల్లలతో, పాటలు , కథలు, చెప్పించడం జరిగింది, టీచర్స్, ఆయాలకు, పిల్లలకు క్యారింగ్ గురించి మాట్లాడటం వివరించారు, అలాగే సెంటర్లలో ఫుడ్ స్టాప్, నిలువలు, అన్ని రిజిస్టర్లు పరిశీలించారు, ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మ, సూపర్వైజర్ నీరజ , జ్యోతి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, తల్లులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జైలు తనిఖీ చేసిన డాక్టర్ సౌమ్య మిశ్రా




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర కరాగార శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా శుక్రవారం సూర్యాపేట సబ్ జైల్ ను సందర్శించి తనిఖీ చేశారు. జైలు పరిసరాల పరిశుభ్రత, ఖైదీలకు అందుతున్న ఆహారం, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీల సమస్యలు, అవసరాలు గురించి వివరాలు తెలుసుకున్నారు. జైలులో ఉన్న ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిన డీజీ, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులు సరిపడా నిల్వ ఉంచాలని సూచించారు.అదే విధంగా, జైలులో భద్రతా లోపాలు ఎక్కడైనా ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించి, సీసీటీవీ వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జైలు పరిపాలనలో పారదర్శకత ఉండాలని, ఖైదీలకు మానవీయ విధానంలో వ్యవహరించాలని డాక్టర్ సౌమ్య మిశ్రా స్పష్టం చేశారు. ఖైదీల పునరావాసానికి సంబంధించిన కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.ఈ తనిఖీలో కారాగార శాఖ అధికారులు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ ప్రిజన్స్ డా.డి. శ్రీనివాస్,నల్గొండ డి ఎస్ జె ఏ ఆర్.శోభన్ బాబు, సూర్యాపేట సబ్ జైల్ సూపరింటెండెంట్ బి.సుధాకర్, పాల్గొన్నారు.



## నాలుగో వార్డులో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** కూసుమంచి గ్రామ పంచాయితీ 4 వ వార్డులో నెలకొన్న లో వోల్టేజి సమస్యను సర్పంచ్ కొండా కృష్ణవేణి,ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ ఆధ్వర్యంలో పరిష్కరించారు.గత కొన్ని రోజులుగా లో వోల్టేజి సమస్యతో వార్డులోని గృహిణిలు,విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషయాన్ని వారు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి,ప్రజలు అవసరాల దృష్ట్యా అత్యవసరంగా 25 కేవీ నూతన ట్రాన్స్ఫార్మర్ ను మంజూరు చేయించారు.4 వ వార్డు సభ్యురాలు బోడపట్ల శ్రీవిద్య నరేష్ నివాసం ఎదుట విద్యుత్ స్థంభానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ను ఉప సర్పంచ్ వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ పాలకవర్గం సమన్వయంతో ముందుకెళ్తున్నామని తెలిపారు.అనంతరం వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నెల్లూరి రవి,నరేష్,విద్యుత్ శాఖ లైన్ మెన్ బాలాజీ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి:కూసుమంచి టీజీఈ జేఏసీ డిమాండ్

**తహశీల్దార్ డి.సైదులు కు వినతి పత్రం అందజేత**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్ల కార్యాచరణ సమితి (టిజిఈ జేఏసి)కూసుమంచి యూనిట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్ లు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు.తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై ప్లకార్డులు చేతబట్టి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని,సీపీఎస్ స్కీమ్ ను రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.పెండింగ్లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులకు,పెన్షనర్లకు నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న సుమారు రూ.13,000 కోట్ల బిల్లులను తక్షణమే విడుదల చేసి పెన్షనర్లకు,ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలని లేని పక్షంలో ఆందోళ

## ఉపాధ్యాయ,ఉద్యోగ,పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మం రూరల్ టిజీఈ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ ఉపాధ్యాయ,ఉద్యోగులు,పెన్షనర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ధరావత్ రాములు,స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీఎఫ్ ) జిల్లా అధ్యక్షులు ఎస్.కె మన్సూర్ అలీ అన్నారు.టిజిఈ జేఏసీ ఖమ్మం రూరల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట ద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను ప్రస్తుతం చెల్లిస్తున్న 700 కోట్లు వాయిదా పద్ధతిలో కాకుండా ఒకేసారి 13 వేల కోట్లను విడుదల చేసి ఇబ్బందులను తొలగించాలని కోరారు.హెల్త్ కార్డుల విధి విధానాలను రూపొందించి పెన్షనర్స్ ఇబ్బందులను తొలగించి 1 మే 2026 నుండి వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డులను అందించాలని తెలిపారు.సిపిఎస్ వ్యవస్థను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరణ చేయాలని,1 సెప్టెంబర్ 2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపిఎస్ ను అమలు చేయాలని,దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న డిఏ లను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం తహసిల్దార్ వినయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టిఓ జాతీయ ఉపాధ్యక్షులు చిత్తలూరు ప్రసాద్,పిఆర్టియు మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రంగిశెట్టి రమేష్,సాయిబాబా,టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నవీన్ కుమార్,సతీష్,ఎస్టిఎఫ్ మండల బాధ్యులు రామకృష్ణంరాజు,ఎస్టియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ వెంకటేశ్వర్లు,వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా,మండల బాధ్యులు శ్రీనివాస రావు,ఎం.వి రమణ,వినోద, వెంకట్రావు,భాస్కర్, జలంధర్, వెంకన్న, నాగమణి, ధనలక్ష్మి ,బేబీ చిరంజీతా,రంగమ్మ,శైలజ,లావణ్యతదితరులు పాల్గొన్నారు.

## వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలంలోని పోషనిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు విధానాన్ని సమీక్షించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రతి వరి సంచికి 40.600 కిలోల తూకం ఉండేలా ఖచ్చితంగా కొలవాలని ఆయన ఆదేశించారు. తూకం ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనంతరం సన్న దాన్యం నాణ్యతను మిషన్ ద్వారా పరీక్షించి, తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే కేంద్రంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, నిల్వ సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డి ఎం శ్రీకాంత్, డి సి ఓ రామ్మోహన్, తాసిల్దార్ సుమలత, ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, ఎంపీ ఓ తిరుపతిరెడ్డి, మండల విద్యాధికారి ఆనందరావు, మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ భాను, ఏ ఈ ఓ రాణి, గ్రామ సర్పంచ్ సుద్దాల లింగం, పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అధికారులు, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.




## వడదెబ్బ అవగాహన



**సత్తుపల్లి, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:** సత్తుపల్లి జె.వి.ఆర్.ఓ.సి ప్రాజెక్ట్లో గని కార్మికులకు వేసవి జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యురాలు లలిత వడదెబ్బ నివారణకు నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బఫర్ జోన్ లో భారీ అక్రమ నిర్మాణం

- జీరో పర్మిషన్ లో ఆరు అంతస్తులా..?
- 2024 లోనే అనుమతికి తిరస్కరణ..!
- అన్నీ తెలిసిన అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..?
- లంచాల మత్తులో కంప్లైంట్లు గాలికి..?


OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION TG-bPASS

REVOCATION LETTER
(REVOCATION OF THE BUILDING PERMISSION As per GHMC TG-bPASS ACT)

[redacted] PLOT.NO.85/A, BALA, [redacted] PALLY, HYDERABAD-500072, TELANGANA.

| | |
|---|---|
| Lr No | 404716/GHMC/9489/2024 |
| Date | 26-06-2024 |

Dear Sir/Madam,

Sub: GREATER HYDERABAD MUNICIPAL CORPORATION - Proposed construction of Individual Residential Building on Plot No/House No: PART OF PLOT.NO. 39 AND H.NO.15-21-150/104, (OLD.NO.21-150/42), Locality: BALAJI NAGAR, Survey No: 1084, Kukatpally(V), Moosapet Circle 23, Kukatpally Zone, Kukatpally(M), GHMC, Medchal - Malkajgiri(Dist) Misrepresentation of Facts - Permission Revoked - Reg.

Ref:
1. Building Registration / Self Certification vide no : 404716/GHMC/9489/2024 dated: 01-06-2024. Issued through the TG-bPASS application.
2. Post verification dt 26-06-2024.

With reference to subject & references cited, it is to inform that you have obtained building permission for construction of Stilt for Parking + 2 Upper Floor in Plot No/House No: PART OF PLOT.NO. 39 AND H.NO.15-21-150/104, (OLD.NO.21-150/42), Locality: BALAJI NAGAR, Survey No 1084, Kukatpally(V), Moosapet Circle 23, Kukatpally Zone, Kukatpally(M), GHMC, Medchal - Malkajgiri(Dist), based on Self Certification submitted by you and the same has been examined as per the provisions of Building Rules 2012 vide G.O.Ms No: 168 M.A. dt : 07-04-2012 & it's time to time amendments and as per the provisions of approved Master Plan etc., and it is observed that the permission has been obtained by misrepresenting the facts as stated below:



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలు రాజ్య మేలుతుంటే... లక్షల్లో లంచాలు మింగిన అధికారులు మాత్రం సీట్లకు అతుక్కు పోయి, ఎక్కడ ఏం జరిగితే మాకేంటి మా జేబులు నిండాయా లేదా అని మాత్రమే చూసుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే బాలాజీ నగర్ కాలనీలో ఐడియల్ చెరువుకి ఆనుకుని ఉన్న బఫర్ ఏరియాలో ఏమాత్రం పరిమితి లేకుండా ఒక నిర్మాణదారుడు ఆరు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. గతంలో 2024 లోనే స్థానిక టౌన్ ప్లానింగ్ ఆఫీసులో భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఆ స్థలం జనజీవనానికి అనుగుణంగా ఉండదు, కేవలం పంటలు పండించుకోవడానికి మాత్రమే వీలవుతుంది అని అక్కడ ఎటువంటి అక్కడ నిర్మాణం చేపట్ట కూడదని అనుమతి నిరాకరించారు. అయినా ఇవేవీ పట్టించుకోని నిర్మాణదారుడు గతంలో ఒక రెండు అంతస్తులు నిర్మించి కొంతకాలం ఆగి ఇప్పుడు మరో మూడంతస్తులు యదేచ్ఛగా నిర్మిస్తున్నారు. పదుల సంఖ్యలో అక్కడ జరిగే తతంగంపై జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులకు ప్రజల తరపున ఎన్నో కంప్లైంట్లు ప్రజావాణి ద్వారా వెళ్లినా కానీ స్థానికంగా అధికారుల్లో ఎటువంటి చలనం లేకుండా ఉన్నారని, లక్షల్లో ముడుపులు ముట్టాక అది అక్రమమైన సక్రమమే అని గాలికి వదిలేస్తున్నారని స్థానికులు అధికారులపై తీవ్రంగా మండిపడుతున్నారు. స్థానిక అధికారులు నిమ్మకు నీరు ఎత్తకుండా ఉంటే హైడ్రాధికారులైన ఇటువంటి నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వం ఎప్పటికీ ప్రజలకు అండగానే ఉంటుందని నిరూపించాలి అంటున్నారు.

## సర్పంచ్ సంఘం ఎన్నిక

- నూతన కమిటీ ఎన్నిక
- ఏకగ్రీవంగా ఎన్నికలు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**



అశ్వారావుపేట మండలంలో సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఉత్సాహభరితంగా జరిగింది. ఉట్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కాసాని గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికలను చేపట్టారు. మండలంలోని సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో హాజరై ఏకగ్రీవంగా కమిటీని ఎంపిక చేశారు.మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కన్నాయిగూడెం సర్పంచ్ గుజ్జా సంకుర్ రావు ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా రామన్నగూడెం సర్పంచ్ మడకం నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా గుమ్మడివల్లి సర్పంచ్ పాయం శ్రీదేవి, నారాయణపురం సర్పంచ్ మడకం కుమారి, ఉట్లపల్లి సర్పంచ్ సత్యం లక్ష్మి కుమారి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కొత్త మామిళ్లవారి గూడెం సర్పంచ్ వగ్గేల లక్ష్మణరావు, కోశాధికారిగా తిరుమల కుంట సర్పంచ్ కోర్స రాజేష్ బాధ్యతలు చేపట్టారు. ఇతర సభ్యులను కూడా రెండు సంవత్సరాల కాలానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎన్నిక అనంతరం అధ్యక్షుడు గుజ్జా సంకుర్ రావు, ప్రధాన కార్యదర్శి మడకం నాగేశ్వరరావు మాట్లాడుతూ సర్పంచ్‌ల నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో రాజీ ఉండదని పేర్కొన్నారు.కొంతమంది సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా స్పందిస్తూ, కార్యదర్శుల నుంచి వేధింపులు ఉంటే సహించబోమని హెచ్చరించారు. అవసరమైతే సంఘం తరపున పోరాటానికి సిద్ధమని తెలిపారు.



## అశ్వారావుపేట హైస్కూల్ లో ముందస్తు బడిబాట

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**

అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో ముందస్తు బడిబాట ప్రారంభమైనది. ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత ఆధ్వర్యంలో తమ పాఠశాల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి ప్రాధమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను , ప్రాదమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను తమ పాఠశాలలో చేరవలసినదిగా కోరుతూ పాఠశాల కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. విద్యార్థులకు ఆదునిక సౌకర్యాలు, గ్రంధాలయ సౌకర్యం, బ్యూటీషియన్, కంప్యూటర్ వంటి కోర్సులు తమ పాఠశాలలో ఉన్నాయని ప్రభుత్వ బడులను వినియోగించుకొని భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలని కోరుతూ విద్యార్థులకు వివరించారు. నారంవారిగూడెం, గుర్రాల చెరువు, వడ్డెరబజార్, దొంతికుంట, చిన్నంశెట్టిబజార్, అశ్వారావుపేట పాఠశాలల్లో బడిబాట నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట పాఠశాల ఉపాధ్యాయులు, నర్సింహారావు, లక్ష్మయ్య, హరిబాబు, సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు ఉన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన

- పెండింగ్ బిల్లులు, సిపిఎస్ రద్దు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**



అశ్వారావుపేట మండలం మామిళ్లవారి గూడెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, ఆమోదయోగ్యమైన పిఆర్సి అమలు చేయాలని, డిఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సిపిఎస్ రద్దు సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ఈ నిరసనలో భాగస్వామ్యమై ఐక్యంగా తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. పిఆర్సి అమలులో ఆలస్యం, డిఏ బకాయిలు చెల్లింపులో నిర్లక్ష్యం ఉపాధ్యాయ వర్గాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. సిపిఎస్ రద్దు అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

## జాతర జోష్

- మొక్కులు.. మంటల్లో భక్తి

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**



అశ్వారావుపేట పట్టణంలోని గుర్రాల చెరువు వద్ద చిన్న కుర్రాజుల జాతర మహోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ఈ జాతరలో భక్తుల సందడి అట్టహాసంగా కనిపించింది. యాటపోతుల సంబరాలు, పూజా కార్యక్రమాలు నువ్వా నేనా అన్నట్టుగా కొనసాగుతూ జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.భక్తులు నిప్పుల కొలిమిలో మొక్కులు చెల్లిస్తూ తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. జాతర ప్రాంగణం అంతా భక్తి వాతావరణంతో నిండిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను మరింత వైభవంగా మార్చారు.ప్రత్యేక పూజల్లో అశ్వారావుపేట మండల బిఆర్ఎస్ నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి, గొడవర్తి వెంకటేశ్వరరావు, నారం రాజశేఖర్, టీ న్యూస్ మణికంఠ, వి పూజతో పాటు, కుమారస్వామి స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఉత్సాహం కలగలిపిన వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## చెరువు కబ్జా?

- రికార్డుల తారుమారుపై తీవ్ర ఆరోపణలు
- బౌండరీల మార్పులతో గందరగోళం
- సమగ్ర విచారణకు ప్రజలు, రైతుల డిమాండ్

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట పట్టణంలో ఉన్న దొంతికుంట చెరువు ప్రస్తుతం తీవ్ర వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. ఒకప్పుడు పట్టణానికి సహజ అందాన్ని అందించిన ఈ చెరువు, ఇప్పుడు అక్రమాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొంతమంది ప్రభావశీలులు పెద్ద ఎత్తున రికార్డులను తారుమారు చేసి చెరువు భూములను కబ్జా చేశారనే అనుమానాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రెవెన్యూ స్థాయిలోనే రికార్డుల్లో మార్పులు జరిగాయని, అసలు సర్వే వివరాలను మార్చి చెరువు సరిహద్దులను కూడా తారుమారు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బౌండరీలు మారడంతో అసలు చెరువు విస్తీర్ణం ఎంత అనే అంశం కూడా గందరగోళంగా మారింది. ఇది యాదృచ్ఛికంగా జరగలేదని, దీని వెనుక ప్రణాళికాబద్ధంగా జరిగిన చర్యలున్నాయనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.ఏళ్ల తరబడి చెరువు పరిధిలో ఉన్న భూములను కొంతమంది ఆక్రమించి, తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులే ఈ వ్యవహారంపై మౌనం వహించడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. పై స్థాయి అండదండలతోనే ఈ తరహా మార్పులు సాధ్యమయ్యాయని ప్రజలు అనుమానిస్తున్నారు. దొంతికుంట చెరువు నిజంగా ఎంతవరకు ఆక్రమణకు గురైందో తేల్చాల్సిన అవసరం అత్యవసరంగా ఉందని ప్రజలు, రైతులు స్పష్టం చేస్తున్నారు. అసలు రికార్డులను బయటపెట్టి, చెరువు అసలైన సరిహద్దులను పునర్నిర్ధారించాలని కోరుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ వంటి సంబంధిత శాఖలు కలిసి సమగ్ర విచారణ చేపట్టి నిజాలను వెలికితీయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువు కేవలం నీటి నిల్వ కేంద్రం మాత్రమే కాదు... పట్టణ జీవనానికి ఆధారం, పర్యావరణ సమతుల్యతకు కీలకం. అలాంటి చెరువును కోల్పోతే భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి చెరువును ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, అభివృద్ధి దిశగా చర్యలు చేపడితే పట్టణానికి మళ్లీ పూర్వ వైభవం వస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## ఐజీ ఆకస్మిక తనిఖీ

- స్టేషన్ పనితీరు పరిశీలన
- రోడ్డు ప్రమాదాలపై ఆరా

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**

అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను మల్టీ జోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. దమ్మపేటలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఎరైవ్ – ఎలైవ్ అవగాహన సదస్సుకు హాజరై తిరుగు ప్రయాణంలో స్టేషన్‌ను పరిశీలించారు.స్టేషన్‌లోని సిబ్బంది పనితీరు, కార్యాలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, విధుల అమలు తీరుపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై కూడా ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేకంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టం చేయాలని, ప్రమాదాల తగ్గింపుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. విధుల్లో మరింత క్రమశిక్షణ, వేగం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భనలో ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ నాగరాజు రెడ్డి, అశ్వారావుపేట, దమ్మపేట ఎస్‌హెచ్ఓలు, ఎస్ఐలు యయాతి రాజు, సాయి కిశోర్ రెడ్డి, అఖిల పాల్గొన్నారు.

## ఆఫీసే చెత్త



**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:** అశ్వారావుపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పరిస్థితులు ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. మండలానికి మార్గదర్శకంగా ఉండాల్సిన కార్యాలయం చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడం, ముఖ్యంగా ఆధార్ సెంటర్ వెనుక భాగంలో నిర్మించిన టాయిలెట్స్ దుస్థితి తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ప్రజాధనంతో నిర్మించిన టాయిలెట్స్ ఉపయోగంలో లేకపోవడం, వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, లోపల పరిశుభ్రత లేకపోవడం గమనార్హం. నీటి సౌకర్యం లేకపోవడంతో అవి పూర్తిగా పనికిరాని స్థితికి చేరుకున్నాయి. ప్రజలకు ఉపయోగపడాల్సిన సదుపాయాలు ఇలా నిర్లక్ష్యానికి గురవడం శోచనీయంగా మారింది.మండల ప్రజలకు సేవలు అందించాల్సిన కార్యాలయం పరిసరాలే చెత్తతో నిండిపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. పర్యవేక్షణ లోపంతో టాయిలెట్స్ చుట్టూ మొక్కలు అడవిలా పెరిగిపోవడం, దుర్వాసన వెదజల్లడం ప్రజలకు అసౌకర్యంగా మారింది.ఈ పరిస్థితిపై స్థానికులు తీవ్రంగా స్పందిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చెత్తాచెదారం తొలగించి, పిచ్చి మొక్కలు శుభ్రం చేసి, టాయిలెట్స్ ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా తక్షణ చర్యలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

## రైతు సంఘం విరాళం

- రూ.50 వేల అందజేత

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్):**




అశ్వారావుపేట మండల రైతు సంఘం కమిటీ రాష్ట్ర మహాసభల కోసం రూ.50 వేల విరాళం అందజేసింది. పాల్వంచలో జరిగిన జిల్లా మహాసభల్లో ఈ నిధులు అందించారు. నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## రాజ్యసభలో కొత్త అడుగు


- ప్రమాణ స్వీకారానికి ఢిల్లీలో హాజరు
- అభివృద్ధిపై ఆశలు వ్యక్తం

**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 రాజముద్ర న్యూస్:**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా ఢిల్లీలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై తన మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి వేం నరేందర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్ష వ్యక్తమైంది. కేంద్ర స్థాయిలో రాష్ట్ర సమస్యలను బలంగా ప్రస్తావించి, పరిష్కారాల కోసం కృషి చేయడంలో ఆయన పాత్ర కీలకమవుతుందనే అభిప్రాయం వ్యక్తమైంది.రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను జాతీయ వేదికపై ముందుకు తీసుకెళ్లే అవకాశాన్ని ఈ పదవి కల్పిస్తుందని, అభివృద్ధి కార్యక్రమాలకు ఊతమివ్వాలని కోరుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.







# 'చాహల్ వద్దు.. విరాట్ లాంటి వాడు కావాలి'

## మనసులో మాట బయటపెట్టిన బ్యూటీ



టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. ధనశ్రీ వర్మతో విడిపోయిన తర్వాత చాహల్ పేరు పలువురితో వినిపించగా, గత కొంతకాలంగా క్రికెట్ హోస్ట్, నటి షెఫాలీ బగ్గాతో ఆయన డేటింగ్‌లో ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ కలిసి ఒక యాడ్‌లో నటించడం, బయట జంటగా కనిపించడంతో ఈ పుకార్లు నెట్టింట షికార్లు చేస్తున్నాయి. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న షెఫాలీ ఈ డేటింగ్ రూమర్స్‌పై క్లారిటీ ఇచ్చారు.

### ఆ ప్రశ్నలతో విసిగిపోయాను..

ఈ పాడ్‌కాస్ట్‌లో చాహల్‌తో డేటింగ్ వార్తలపై షెఫాలీ మాట్లాడుతూ.. "ఈ ప్రశ్నలతో నేను విసిగిపోయాను. కేవలం ఇద్దరు వ్యక్తులు కలిసి డిన్నర్‌కు వెళ్తే అది డేటింగ్ అని ప్రచారం చేయడం ప్రజల సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం. ఇలాంటి వార్తలు వినడానికి చాలా వింతగా అనిపిస్తాయి" అని అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్ గురించి తాను అస్సలు పట్టించుకోనని షెఫాలీ స్పష్టం చేశారు. తనకు, తన చుట్టూ ఉన్నవారికి నిజం ఏంటో తెలుసని అన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో తాను ఒక క్రికెటర్‌ను పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదని ఆమె తేల్చి చెప్పారు. తన ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ను మిక్స్ చేయడం ఇష్టం లేదని అన్నారు.


### విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి..

తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో కూడా షెఫాలీ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.. "నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. విరాట్ -- అనుష్క శర్మ జోడీ నాకు పర్ఫెక్ట్ కపుల్‌లా అనిపిస్తారు" అని తన మనసులో మాట బయటపెట్టారు. గతంలో బిగ్ బాస్ 13లో మెరిసిన షెఫాలీ బగ్గా, ప్రస్తుతం స్పోర్ట్స్ యాంకర్‌గా, నటిగా తన కెరీర్‌లో దూసుకుపోతున్నారు.

# 'సర్పంచ్ సాబ్' సూపర్..

## ప్రీతి జింటా సంబరాలు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026లో పంజాబ్‌కింగ్స్‌జట్టు అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తోంది. ఇప్పటివరకు ఓటమి ఎరుగని జట్టుగా నిలిచిన పీబీకేఎస్, ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు సాధించగా, ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. తాజాగా ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. జట్టు విజయాలతో ఉత్సాహంలో మునిగిపోయిన యజమాని ప్రీతి జింటా సోషల్ మీడియాలో ఆనందాన్ని పంచుకున్నారు. 'సర్పంచ్ సాబ్ సూపర్' అంటూ జట్టు ప్రదర్శనను కొనియాడారు. జట్టులోని యువ ఆటగాళ్ల ప్రదర్శనపై ప్రీతి జింటా ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ప్రభ్‌సిమ్రన్ సింగ్ బ్యాటింగ్‌కు ఫిదా అయిన ఆమె, అతని మెచ్యూరిటీ జట్టుకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అలాగే పేసర్ అర్ష్‌దీప్‌సింగ్‌బౌలింగ్‌ను మెచ్చుకుంటూ అతని ఆటతీరును అభినందించారు. కెప్టెన్ శ్రేయస్‌అయ్యర్ నాయకత్వంపై ప్రత్యేకంగా స్పందిస్తూ 'సద్దా సర్పంచ్' అంటూ ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో జట్టు సమిష్టిగా రాణిస్తోందని, కోచ్ రికి పోంటింగ్‌మార్గదర్శకత్వం కీలకమైందని పేర్కొన్నారు. ముంబైపై మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ పట్టిన అద్భుత క్యాచ్‌ను ప్రస్తావిస్తూ 'నేను చూసిన బెస్ట్ క్యాచ్‌లలో ఒకటి' అని కొనియాడారు. 'నీ కంటే లేరెవరూ తోపు' అంటూ ఆయనను మెచ్చుకున్నారు. మొత్తంగా యువ ఆటగాళ్ల మెరుపులు, కెప్టెన్-కోచ్ సమన్వయం పంజాబ్ జట్టును ఈ సీజన్‌లో టైటిల్ రేసులో ముందంజలో నిలబెట్టాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో మూడు విజయాలు సాధిస్తే ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.





# గిల్ గర్జన.. గుజరాత్ విజయం

**ఉత్కంఠ పోరులో కేకేఆర్ పై జీటీ ఘన విజయం**

**86 పరుగులతో చెలరేగిన శుభ్‌మన్ గిల్**

**వృథా అయిన కామెరాన్ గ్రీన్ (79) పోరాటం**

**ఆకట్టుకున్న రబాడ, సిరాజ్ బౌలింగ్**



**అహ్మదాబాద్, ఏప్రిల్ 17:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) పై గుజరాత్ టైటాన్స్ (జీటీ) 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. 181 పరుగుల లక్ష్య ఛేదనలో గుజరాత్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (86) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో కేవలం రెండు బంతులు మిగిలి ఉండగానే గుజరాత్ లక్ష్యాన్ని చేరుకుంది.

### పోరాడిన గ్రీన్.. కేకేఆర్ గౌరవప్రదమైన స్కోరు

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు త్వరగా పెవిలియన్ చేరినా.. కామెరాన్ గ్రీన్ అద్భుతమైన ఆటతీరు కనబరిచాడు. 55 బంతుల్లోనే 79 పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మిడిలార్డర్ లో రోవ్‌మన్ పావెల్ 20 బంతుల్లో 27 పరుగులు.. చివర్లో టిమ్ సీఫెర్ట్ 14 బంతుల్లో 19 పరుగులతో రాణించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ 3 వికెట్లతో చెలరేగగా.. మహ్మద్ సిరాజ్.. అశోక్ శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టి కేకేఆర్ బ్యాటర్లను కట్టడి చేశారు.

### గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్.. గుజరాత్ విజయం

181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ కు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడుతూ 50 బంతుల్లోనే 86 పరుగులు సాధించి మ్యాచ్ ను గుజరాత్ వైపు తిప్పాడు. మరో ఎండ్ లో జాస్ బట్లర్ 15 బంతుల్లో 25 పరుగులు.. సాయి సుదర్శన్ 16 బంతుల్లో 22 పరుగులు చేసి గిల్ కు చక్కటి సహకారం అందించారు. చివర్లో వరుసగా వికెట్లు పడటంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. ఆఖరి ఓవర్లో విజయానికి పరుగులు కావాల్సిన తరుణంలో గుజరాత్ బ్యాటర్లు సంయమనంతో ఆడి 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించారు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 34 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా.. సునీల్ నరైన్.. రమణ్‌దీప్ సింగ్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఒంటరి పోరాటం చేసిన కామెరాన్ గ్రీన్ కష్టం వృథా కాగా.. సమిష్టి కృషితో గుజరాత్ అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.




# నా కెరీర్‌లో చూసిన బెస్ట్ క్యాచ్ అదే

**సచిన్ టెండూల్కర్**



ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్ (ఫ్రాడీఖూ), ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఒక అద్భుతమైన క్యాచ్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఈ క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది ఒకటి అని సచిన్ కొనియాడారు. ముంబై ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో మార్కో జాన్సెన్ వేసిన బంతిని హార్దిక్ పాండ్యా బౌండరీ వైపు బలంగా బాదాడు. అది సిక్సర్ వెళ్తుందని అందరూ భావించారు. కానీ లాంగ్-ఆన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న శ్రేయస్ అయ్యర్ గాలిలోకి ఎగిరి బంతిని అందుకున్నాడు. తాను బౌండరీ లైన్ దాటుతున్నానని గ్రహించి, కింద పడబోయేలోపు చాకచక్యంగా బంతిని పక్కనే ఉన్న గ్జేవియర్ బార్ట్లెట్‌కు విసిరాడు. బార్ట్లెట్ దాన్ని సులువుగా అందుకోవడంతో హార్దిక్ పాండ్యా అవుట్ అయ్యాడు.

### సచిన్ టెండూల్కర్ ఏమన్నారంటే..?

ఈ అద్భుతమైన ఫీల్డింగ్‌ను చూసి సచిన్ ఫిదా అయిపోయారు. "ఈ క్యాచ్ ఇంత స్పెషల్ కావడానికి కారణం కేవలం శ్రేయస్ శారీరక వేగం మాత్రమే కాదు, అతని సమయస్ఫూర్తి కూడా. బంతి వేగాన్ని అంచనా వేయడం, బౌండరీ లైన్‌కు ఎంత దూరంలో ఉన్నామో చూసుకోవడం, గాలిలో ఉండగానే పక్కనే ఉన్న ఫీల్డర్‌కు బంతిని విసరడం.. ఇవన్నీ సెకను కాలంలో జరిగిపోయాయి. దీనికి అద్భుతమైన ఫిట్‌నెస్, ఏకాగ్రత అవసరం. శ్రేయస్ ఇవన్నీ పక్కాగా చేశాడు" అని సచిన్ తన సోషల్ మీడియా వేదికగా మెచ్చుకున్నారు.

### మ్యాచ్ విషయానికి వస్తే..

ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ క్వింటన్ డికాక్ సెంచరీ (112 నాటౌట్) సాయంతో 195 పరుగులు చేసింది. అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లు తీసి ముంబైని కట్టడి చేశాడు. అనంతరం పంజాబ్ ఈ లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (80 నాటౌట్), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (66) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోగా.. ముంబై ఇండియన్స్ తొమ్మిదో స్థానానికి పడిపోయింది. శ్రేయస్ అయ్యర్ పట్టిన ఆ క్యాచ్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.



# ఒంటరిగా జీవించడంలోనే ఆనందం: హన్సిక

నటి హన్సిక వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు ఇటీవల చర్చనీయాంశంగా మారాయి. 2022 డిసెంబర్ 4న జైపూర్‌లో వ్యాపారవేత్త సోహెల్ ఖతూరియాతో వివాహం చేసుకున్న ఆమె, కొంతకాలం తర్వాత వ్యక్తిగత కారణాలతో విడాకుల కోసం బాంద్రా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తాజాగా న్యాయస్థానం వీరి విడాకులకు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల సోషల్ మీడియా ద్వారా అభిమానులతో మాట్లాడిన హన్సిక, ప్రస్తుతం తన జీవితంలో ప్రశాంతంగా ఉన్నట్లు వెల్లడించింది. స్వేచ్ఛగా జీవించడం తనకు ఎంతో ఇష్టమని, ఒంటరిగా గడపడం తనకు సంతృప్తిని ఇస్తుందని తెలిపింది. తనకు నచ్చిన పనులు చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సమయం గడపడం ఆనందంగా అనిపిస్తోందని పేర్కొంది. హన్సిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

# ఐఎన్‌సీఏ అవార్డ్సులో తెలుగు సినిమాల హవా



దేశంలోని వివిధ భాషల సినీ పరిశ్రమలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ (×చీజూ) 2026 అవార్డుల ప్రదానోత్సవం ముంబయిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి, నటి శ్రీయ శరణ్, నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు లభించింది. 'తండేల్' చిత్రంలో నటనకు గాను నాగచైతన్యకు ఉత్తమ నటుడు అవార్డు లభించగా, 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటి పురస్కారం అందుకున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి అనిల్ రావిపూడి ఉత్తమ దర్శకుడిగా ఎంపిక కాగా, అదే చిత్రంలో నటించిన మాస్టర్ రేవంత్ ఉత్తమ హాస్య నటుడిగా అవార్డు అందుకున్నారు. ఇతర విభాగాల్లో రిషబ్ శెట్టి ('కాంతారా చాప్టర్ 1'), దుల్కర్ సల్మాన్ ('కాంత') ఉత్తమ నటులుగా గుర్తింపు పొందారు. సీనియర్ నటి సిమ్రన్, కళ్యాణి ప్రియదర్శన్ ఉత్తమ నటీమణులుగా ఎంపికయ్యారు. 'మిరాయ్' చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ అవార్డు దక్కింది. 'కోర్ట్' చిత్రానికి రామ్ జగదీష్ ఉత్తమ తొలి దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. భారతీయ సినిమాకు చేసిన విశేష సేవలకు గాను కమల్ హాసన్, రేఖలకు ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. వివిధ విభాగాల్లో తెలుగు చిత్రాలకు అధికంగా అవార్డులు దక్కడం పట్ల సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభినందనలు తెలియజేస్తున్నారు.



## ఐఎన్‌సీఏలో రుక్మిణి హొయలు

తాజాగా నిర్వహించిన ఐఎన్‌సీఏ అవార్డ్స్ వేడుకలో యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి సిల్వర్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో హాజరైన ఆమె, అందరి దృష్టిని ఆకర్షించింది. వేదికపై రుక్మిణి వసంత్ వివిధ భంగిమల్లో ఫోటోలకు పోజులు ఇవ్వగా, ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి.

# చిరాగ్ పాశ్వాన్‌తో ఎలాంటి రిలేషన్ లేదు

## క్లారిటీ ఇచ్చిన నటి కంగనా రనౌత్



కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరుచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్, ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది. పాశ్వాన్‌తో తన రిలేషన్ చాన్నాళ్ల నుంచి అలాగే ఉందన్నారు. ఒకవేళ తనకు రొమాన్స్ కావాలనుకుంటే, అది జరిగేదని, కానీ అలాంటిది ఏమీ లేదని, అది కేవలం ఫ్రెండ్లీ పరిచయం మాత్రమే అని, అతను కూడా ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వచ్చాడని, అందుకే తమ మధ్య పరిచయం కాస్త చనువుగా ఉంటుందని ఆమె అన్నారు. 2011లో రిలీజైన మిలే నా మిలే హమ్ చిత్రంలో కంగనా, చిరాగ్ పాశ్వాన్ కలిసి నటించారు. తన్వీర్ ఖాన్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఆ తర్వాత ఇద్దరూ రాజకీయాల్లో రాణించారు. కానీ కంగనా అడపాదడపా చిత్రాల్లో నటిస్తోంది. చివరిసారి ఆమె ఎమర్జెన్సీ చిత్రంలో యాక్ట్ చేశారు.

# హెలికాప్టర్లో బాలయ్యతో డింపుల్ సెల్ఫీ

నటసింహం నందమూరి బాలకృష్ణ, నటి డింపుల్ హయాతి కలిసి గుంటూరులో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్ర మంలో సందడి చేశారు. లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ ఆభరణాల షోరూ మ్ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరు కాగా, డింపుల్ హయాతి కూడా పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఇద్దరూ ఒకే ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. హెలికాప్టర్ ప్రయాణ సమయంలో డింపుల్ హయాతి తీసుకున్న సెల్ఫీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాధారణంగా గంభీరంగా కనిపించే బాలకృష్ణ ఈసారి సరదాగా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇక సినిమాల విషయానికి వస్తే, బాలకృష్ణ ప్రస్తుతం 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో డింపుల్ హయాతి నటిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com